సాక్షి
జగిత్యాల
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ అరెస్ట్

గాంధీ ఆసుపత్రిలో చోటుచేసుకుంటున్న మరణాలపై అధ్యయనం చేయడానికి సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి వెళ్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

-8లో



దాడి చేసి.. డబ్బులు, ఫోన్ లాక్కెళ్లి

వ్యాన్ డ్రైవర్‌పై దాడి చేసి, డబ్బులు, ఫోన్ లాక్కెళ్లిన ముగ్గురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. వారిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు.

-8లో

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది.కొన్నిచోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రి సమయంలో చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

బాధితులకు సత్వర న్యాయం చేయాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 11 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలని, స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

జగిత్యాల నుంచి కొండగట్టుకు పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న భక్తులు

జగిత్యాల: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని హిందూ భక్తులు జగిత్యాల నుంచి కొండగట్టు వరకు సోమవారం పాదయాత్ర చేపట్టారు. బీజేపీ నాయకులు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుమల పవిత్రతను ప్రతిఒక్కరూ కాపాడాలన్నారు. పాదయాత్ర సభ్యులు కట్కం శేఖర్, సాయికృష్ణ, రమేశ్, రంజిత్, శేఖర్, శివనక భరత్, మున్సిపల్ మాజీ చైర్మన్ జీఆర్.దేశాయి, ఏసీఎస్ రాజు, మానాల కిషన్, సుధాకర్, కిశోర్, శంకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సర్దుబాటు జీవోపై పునరాలోచించాలి



వర్షకొండలో సభ్యత్వాలు చేస్తున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆగమయ్య

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం సరికాదని, తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున నియమించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తులసి ఆగమయ్య డిమాండ్ చేశారు. మండలంలో యూనియన్ సభ్యత్వ నమోదును సోమవారం చేపట్టారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగానే ప్రభుత్వం జీవో తెచ్చిందని, పేదలకు నాణ్యమైన విద్య అందాలంటే తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని సూచించారు. పాఠశాలల్లో గదుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, డిజిటల్ బోధన, ఉచిత కరెంట్, పారిశుద్ధ్య కార్మికుల నియామకం చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదే శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు దస్తరి శివకృష్ణ, నాయకులు తిరుపతినాయక్, అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రం తనిఖీ



మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీనివాస్

మల్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టీబీ నిర్మూలన ప్రోగ్రాం అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేశారు. టీబీ వ్యాధిగ్రస్తుల రిజిస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 25న కేంద్రబృందం పర్యటించనుందని తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాల్లో 2023 రికార్డుల ప్రకారం 1805 మంది టీబీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వీరిలో 1104 మందికి ప్రభుత్వ సాయం అందుతోందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాధ, హెచ్‌ఈఓ రమేశ్ ఉన్నారు.

26న ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని వివేకానంద స్టేడియంలో ఈనెల 26న అండర్–14, 17 ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 26న ఉదయం 9 గంటలకు అర్హత పారాలతో రిపోర్ట్ చేయాలని సూచించారు.

కమిషనర్ వర్సెస్ చైర్‌పర్సన్

- కమిషనర్ బదిలీకి సంతకాల సేకరణ
- అభివృద్ధి విషయమై తలెత్తిన వివాదం?
- తమకు సహకరించడం లేదంటున్న కౌన్సిలర్లు
- సెలవుపై వెళ్లేందుకు కమిషనర్ నిర్ణయం
- కలెక్టర్ అంగీకరించకపోవడంతో వెనక్కి..?



జగిత్యాల మున్సిపాలిటీ కార్యాలయం

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీకి వస్తున్న కమిషనర్ బాధత్యల నిర్వహణ అధికారులకు తలనొప్పిగా మారుతోంది. అభివృద్ధి విషయమై కొంత కాలంగా చైర్‌పర్సన్, కొంతమంది కౌన్సిలర్లు, కమిషనర్ మధ్య పొసగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత కమిషనర్ అభివృద్ధి విషయమై తమకు సహకరించడం లేదని ఆరోపిస్తూ చైర్‌పర్సన్ కౌన్సిలర్లతో సంతకాలు సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో బల్దియాలో ఏదో జరుగుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేయాలంటే కత్తిమీద సాముగా మారింది.

అభివృద్ధి ఎలా..?

జగిత్యాల మున్సిపాలిటీ కావడం.. పైగా జిల్లాకేంద్రం కావడంతో సహజంగానే అందరి దృష్టి ఉంటుంది. ఈ బల్దియాలో గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుచుకుని చైర్‌పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. అయితే కొద్దిరోజుల క్రితం చైర్‌పర్సన్ బోగ శ్రావణి రాజీనామా చేయడంతో అప్పటివరకు వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్ ఇన్‌చార్జిగా రెండేళ్లపాటు కొనసాగారు. ఆయన హయాంలో అభివృద్ధి అంతంతమాత్రంగానే కొనసాగినట్లు ప్రజలు చర్చించుకున్నారు. ఆ సమయంలో కమిషనర్లు సక్రమంగా ఉండకపోవడం.. వచ్చిన వారు కొద్దిరోజులే ఉండటంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడిందన్న అపవాదు ఉంది. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రత్యేక జీవో తీసుకొచ్చి బల్దియాకు చైర్‌పర్సన్ నియమించేలా చర్యలు తీసుకున్నారు. అప్పటివరకు బీఆర్‌ఎస్ పార్టీకి పూర్తి మెజార్టీ ఉన్నా రెబల్ అభ్యర్థిగా అడువాల జ్యోతి బరిలో నిలిచి కాంగ్రెస్ కౌన్సిలర్ల సహకారంతో చైర్‌పర్సన్‌గా విజయం సాధించారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. ఆ సమయంలో కమిషనర్‌గా ఉన్న అనిల్‌కుమార్ ఓ భూకబ్జా యత్నం కేసులో ఇరుక్కున్నారు. ఆయన దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. భూకబ్జాపై విచారణ చేపట్టిన అధికారులు ఆయనను రిమాండ్ చేయించారు. అనంతరం ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని సెక్రటరియేట్‌లో పనిచేస్తున్న సమ్మయ్యను కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన వచ్చిన కొద్దిరోజులవరకు పాలకవర్గంతో కలిసిమెలిసి పోయారు. కానీ.. కొద్దిరోజులుగా వివాదాలు చోటుచేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అభివృద్ధి విషయంలో కమిషనర్ తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని పాలకవర్గం ఆరోపిస్తోంది. చెత్త సేకరణకు సంబంధించిన వాహనాలు గ్యారేజీలో ఉంటున్నప్పటికీ మరమ్మతు చేయించడం లేదని, పనులు సక్రమంగా నిర్వహించడం లేదని, అనుకూలమైన వారికే పనులు అప్పగిస్తున్నారని చైర్‌పర్సన్ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన బదిలీ చేయించేందుకు కౌన్సిలర్లతో సంతకాలు సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న కమిషనర్ తాను సెలవుపై వెళ్తానని జిల్లా కలెక్టర్‌ను కలిసి కోరినట్లు తెలిసింది. దీనికి కలెక్టర్ అంగీకరించలేదని, పెద్ద మున్సిపాలిటీ కావడంతో సెలవు లేదని చెప్పినట్లు సమాచారం.

ముందుకు కదలని పనులు

- ఇప్పటికే అధికార పార్టీకి ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి ఉన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. దీంతో జిల్లాకేంద్రం అభివృద్ధి జరుగుతుందని అందరూ భావించారు. శానిటేషన్‌గానీ, డ్రెయినేజీ మరమ్మతుగానీ సక్రమంగా కొనసాగడం లేదు. సుందరీకరణ పనులు ఆశించిన మేరలో లేవు. గత ప్రభుత్వం పట్టణ ప్రగతి కింద రూ.50 లక్షలు మంజూరు చేసింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిధులు ఇవ్వకపోవడం మున్సిపాలిటీకి గుది బండగా మారింది. జగిత్యాలలో 48 వార్డులుండగా.. తేలికపాటి వర్షానికే మురికికాలువలు పొంగి పొర్లుతున్నాయి. అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. జనావాసాల్లో నీటి నిల్వలు కుంటలను తలపిస్తున్నాయి. దోమలు, ఈగలు వృద్ధి చెంది పట్టణ వాసులు వ్యాధుల బారిన పడుతున్నా రు. శానిటేషన్ వాహనాల విషయంలో వివా దాలు చోటుచేసుకోవడంతో ఇబ్బందికరంగా మారింది. అభివృద్ధి విషయంలోనే చైర్‌పర్సన్, కమిషనర్‌కు మధ్య వివాదాలు చోటుచేసుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవ తీసుకుని మున్సిపల్ అభివృద్ధి పర్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డబుల్‌బెడ్‌రూం పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: డబుల్‌బెడ్‌రూం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. హౌసింగ్, పంచాయతీరాజ్, మిషన్‌భగీరథ అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. పనులు ప్రతిరోజూ జరిగేలా చూడాలన్నారు. మురికికాలువల నిర్మాణం, సీవరేజీ పైప్‌లైన్, సెప్టిక్ ట్యాంక్ పనులు, ప్యానల్ బోర్డుల పనులు 10శాతం, వాటర్ పైప్‌లైన్ పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. అక్టోబర్ రెండో వారంలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మొత్తం 4500 ఇళ్ల నిర్మాణం అయ్యిందని, మిగతా ఇళ్ల కోసం 915 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి టీంలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రహమాన్, శేఖర్‌రెడ్డి, రాజేశ్వర్, కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

పదవి కోసం పోటాపోటీ

- మెట్‌పల్లి మార్కెట్‌పై రెండు వర్గాల పట్టు
- నర్సింగరావు, సుజీత్‌రావు వేర్వేరుగా ప్రతిపాదనలు
- కాంగ్రెస్‌లో చర్చనీయాంశమైన వ్యవహారం



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మెట్‌పల్లి: జిల్లాలోని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్‌లో రెండువర్గాలు పోటీ పడుతున్నాయి. కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, పీసీసీ డెలిగేట్ సభ్యులు కల్వకుంట్ల సుజీత్‌రావు తమ అనుచరులకు పదవి ఇప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో నాలుగు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇందులో మూడు కమిటీలకు ప్రభుత్వం పాలకవర్గాలను ప్రకటించింది. మిగిలిన మెట్‌పల్లి కమిటీపై రెండు వర్గాలు పట్టుబట్టుతుండడంతో జాప్యం జరుగుతోంది.

చైర్మన్‌గిరీ జనరల్‌కు

మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ప్రస్తుతం మూడో పర్యాయం జనరల్ కేటాయించారు. మొదట ఎస్సీ జనరల్‌కు, రెండోసారి ఎస్టీ మహిళకు కేటాయించారు. ప్రస్తుతం జనరల్ నుంచి చైర్మన్‌ను నియమించాల్సి ఉంది. దీంతో జువ్వాడి వర్గం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డిని.. సుజీత్‌రావువర్గం కూన గోవర్ధన్‌ను ప్రతిపాదించినట్లు తెలిసింది. ఇప్పటికే రెండు వర్గాలు వేర్వేరుగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.

మిగిలింది ఒక్క కమిటీ..

నియోజకవర్గంలో కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీలకు ఇటీవలే పాలకవర్గాలను నియమించింది. ఈ మూడు కమిటీలకు జువ్వాడి నర్సింగరావు ప్రతిపాదించిన పేర్లకే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మెట్‌పల్లి కమిటీ పదవులకు మాత్రం తాను సూచించిన వారిని ఎంపిక చేయాలని సుజీత్‌రావు పట్టుబట్టుతున్నారు. దీంతో ప్రభుత్వ పెద్దలు దీనిపై నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టినట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏ వర్గానికి ఈ పదవులు దక్కుతాయన్నది పార్టీలో ఆసక్తిగా మారింది.

వీడీసీ, ఉత్సవ కమిటీ వివాదంపై పోలీసుల సీరియస్

- జగ్గాసాగర్ ఘటనపై డీఎస్పీ సమావేశం
- బెల్ట్‌షాపులపై వెలసిన పోస్టర్లపై ఆగ్రహం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌కు చెందిన వీడీసీ, వినాయక ఉత్సవ కమిటీల మధ్య తలెత్తిన వివాదంపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. వినాయక శోభాయాత్రలో డీజేలు పెట్టిన విషయంపై వీడీసీకి, ఉత్సవ కమిటీల మధ్య నాలుగైదు రోజులుగా వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గ్రామంలో బెల్ట్‌షాపులు రద్దు చేయాలంటూ ఆదివారం పోస్టర్లు వెలవడంతో అది మరింత ముదిరింది. పోస్టర్లు వెలవడంపై ఎస్పీ సీరియస్ అయినట్లు తెల్సింది. ఈ మేరకు సోమవారం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు వీడీసీ, ఉత్సవ కమిటీ సభ్యులను తన కార్యాలయానికి వేర్వేరుగా పిలిపించుకుని జరుగుతున్న పరిణామాలపై అడిగి తెలుసుకున్నారు. చట్టాన్ని వీడీసీలు చేతిలోకి తీసుకోవద్దని, డీజేలు పెడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, జరిమానా విధించే అధికారం లేదని సూచించారు. అలాగే బెల్ట్ షాపుల పోస్టర్ల విషయమై యువకులను ప్రశ్నించారు. పోస్టర్లు అతికించిందెవరు?, డీజే ఎందుకు పెట్టారు..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. మంగళవారం వీడీసీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు కొందరిని బైండోవర్ చేయనున్నట్లు సమాచారం.

'ప్రజావాణి'కి ఫిర్యాదుల వెల్లువ

- సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి
- కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి
- బాధితుల నుంచి అర్జీలు స్వీకరణ

జగిత్యాల: ప్రజావాణి సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యల కోసం వస్తారని, అధికారులు వారి శాఖల వారీగా స్వీకరించి వెనువెంటనే సమస్యలు పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో పెట్టొద్దన్నారు. వివిధ సమస్యలపై బాధితులు 56 దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, ఏవో హన్మంతరావు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి



మేం డబుల్‌బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే రావడం లేదు. గతంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద మూడో దశలో ఇళ్లు పొందాం. ఎలాంటి నిర్మాణం చేపట్టలేదు. వారిచ్చిన స్థలంలో కూడా ఉండడం లేదు. మాకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇప్పించాలి.

– జగిత్యాల 7వ వార్డు మహిళలు

భూమిలోకి వెళ్లనివ్వడం లేదు



మాది జగిత్యాల మండలం లక్ష్మీపూర్. గ్రామంలో 343, 344 సర్వే నంబరులో 30 మందికి ప్రభుత్వం వ్యవసాయ భూములు ఇచ్చింది. అందులో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాం. 30మందిలో నలుగురు పట్టాదారులు వారి భూమి ముందు వరుసలో ఉండటంతో మమ్మల్ని మా భూముల్లోకి వెళ్లనివ్వడం లేదు. మాకు న్యాయం చేయాలి.

– కవిత, పుష్ప, మంజుల, లక్ష్మీపూర్

పట్టాలు మంజూరు చేయాలి



మేం కథలాపూర్ మండలం కలికోట, అంబారిపేటతండా, రాజారంతండా, గిరిజన తండావాసులం. గత ప్రభుత్వంలో మాకు 400 మందికి పోడు సాగుదారుకు సర్వే నిర్వహించి భూములు మంజూరు చేసినప్పటికీ పట్టాలు రాలేదు. మాకు పట్టాలివ్వాలిప్పిస్తే సాగు చేసుకుని జీవిస్తాం.

– కథలాపూర్ గిరిజన పోడు సాగుదారులు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి



పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి. జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించండి. రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

– రమేశ్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు – కథలాపూర్

వడివడిగా వారధులు

- 25 కిలోమీటర్ల మేర పూర్తయిన 563 జాతీయ రహదారి
- వరంగల్-కరీంనగర్ సెక్షన్‌లో వేగంగా పనులు
- ఊపందుకున్న ఇరుకుల్ల, మానకొండూరు వంతెనలు
- జగిత్యాల- కరీంనగర్ సెక్షన్‌లో మొదలైన భూసేకరణ
- బిడ్లు, టెండర్ల దాఖలుకు గడువు పెంచిన ఎన్‌హెచ్‌ఏఐ



మానకొండూరు వద్ద నిర్మాణంలో బ్రిడ్జి

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతిష్టాత్మక నాలుగు వరుసల జాతీయ రహదారి ఎన్‌హెచ్-563 నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఈ రహదారి నిర్మాణాన్ని ఉమ్మడి జిల్లాలో రెండు ప్యాకేజీలుగా విభజించారు. వరంగల్- కరీంనగర్ సెక్షన్ 68 కి.మీలకు గతంలోనే టెండర్లు పిలవగా రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. దాదాపు రూ.848 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఈ రోడ్డు నిర్మాణం తాజాగా 25 కి.మీ పూర్తయింది. మరో 43 కి.మీల దూరం రోడ్డు నిర్మిస్తే.. ఈ సెక్షన్ పనులు పూర్తయినట్లే. ఇప్పటికే శంకరపట్నం మండలం కొత్తగట్టు సమీపంలో టోల్‌గేట్ పనులు కొలిక్కి వచ్చాయి. మరోవైపు మానకొండూరు వద్ద వంతెన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇరుకుల్ల వంతెన వద్ద నిర్మిస్తున్న వారధి పనులు గతం కన్నా అధిక వేగంగా జరుగుతున్నాయి. ఈ మార్గంలో భూసేకరణ పనులు ఇప్పటికే పూర్తయి ఉండటంతో ఇక్కడ పనులు నిరంతరాయంగా సాగుతున్నాయి. డిజైన్, బిల్డ్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఓటీ) విధానంలో రోడ్డు నిర్మాణం చేపడుతున్న సంగతి తెలిసిందే.

వచ్చే జూన్ నాటికి పూర్తి

ప్రస్తుతం పనులు సజావుగా సాగుతున్నాయి. మరోవైపు జగిత్యాల- కరీంనగర్ సెక్షన్ పనులు మెల్లిగా గాడిన పడుతున్నాయి. ఈ రహదారిలో జగిత్యాల- కరీంనగర్ సెక్షన్‌లో పనిని రెండు ప్యాకేజీలుగా పిలిచి టెండర్లు పిలిచారు. మొదటిది జగిత్యాల నుంచి గంగాధర వరకు 28 కిమీ దూరం. దీన్ని మొదటి ప్యాకేజీగా పిలుస్తున్నారు. ఇది పూర్తి చేయడానికి దీనికి రూ. 848.56 కోట్లు ఖర్చు చేయనున్నారు. గంగాధర-కరీంనగర్ బైపాస్ (కొత్తపల్లి శివారు) వరకు 30 కి.మీ దూరం. దీన్ని రెండో ప్యాకేజీగా చెబుతున్నారు. ఈ సెక్షన్ పూర్తయ్యేందుకు రూ.893.79 కోట్లు బడ్జెట్ కేటాయించారు. ఈ మొత్తం పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గడువు పెంపు..

జగిత్యాల- కరీంనగర్ సెక్షన్‌లో పనుల కోసం ఇటీవల టెండర్లు పిలిచారు. బిడ్లు, టెండర్లు దాఖలు చేసేందుకు ముందు ఇచ్చిన గడువు కన్నా తాజాగా సమయం పెంచారు. గతంలో బిడ్లకు ఈ ఏడాది సెప్టెంబరు 19న గడువుగా ఉండగా.. దాన్ని సెప్టెంబరు 30న ముగింపు తేదీగా మార్చారు. టెండర్లు సెప్టెంబరు 20న తెరవాలని నిర్ణయించినా.. ఆ తేదీని అక్టోబరు ఒకటో తేదీకి మార్చారు. ఈ మేరకు ఈ నెల 17వ తేదీన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ మార్గంలో భూసేకరణ అధికారులకు సవాలుగా మారిందని సమాచారం. కొన్ని ప్రాంతాల్లో సజావుగానే సాగినా మరికొన్ని ప్రాంతాల్లో అనుకున్నంత వేగంగా సాగడం లేదని తెలిసింది. దీంతో జగిత్యాల- కరీంనగర్ సెక్షన్‌లో పనులు కాస్త జాప్యమయ్యేలా కనిపిస్తున్నాయి.

జీవాల పెంపకానికి చేయూత

- యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ
- గరిష్టంగా రూ.50 లక్షలు అందించనున్న కేంద్రం
- నేషనల్ లైవ్‌స్టాక్ పథకం కింద అమలు



గొర్రెల మంద

గొల్లపల్లి: మాంసం వినియోగానికి అనుగుణంగా జీవాల ఉత్పత్తి పెంచాలని కేంద్రప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం మాంసానికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని జీవాల సంపద పెంచాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా గొర్రెలు, మేకల (జీవాల) పెంపకానికి చేయూతనివ్వాలని నిర్ణయించింది. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం (ఎన్‌ఎల్‌ఎంఎస్)కింద జీవాల పెంపకానికి ఔత్సాహిక వ్యాపారులకు సబ్సిడీ అందిస్తోంది. 2021–2022 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిన ఈ పథకాన్ని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అమలు చేస్తోంది. జీవాలకు సంబంధించిన సబ్సిడీ పూర్తిగా విడుదలయ్యే వరకూ పథకాన్ని ప్రతి రాష్ట్రంలో ఆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పర్యవేక్షించనుంది. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం లేదా గరిష్టంగా రూ.50 లక్షలకు మించకుండా పెంపకందారులకు అందనుంది. యూనిట్ ప్రారంభం నుంచి సబ్సిడీ రెండు విడుతలుగా లబ్ధిదారుల ఖాతాలో జమ కానుంది. 500 గొర్రెలు, 25 పొట్టేళ్ల లేదా మేకల యూనిట్ వ్యయం కనీసం రూ.83లక్షలు ఉంటుందని పశుగణాభివృద్ధి శాఖ అంచనా వేసింది. తెలుగు రాష్ట్రాల్లో గొర్రెలు, మేకల ధరలు ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉండటంతో ప్రాజెక్టు వ్యయం రూ.కోటి వరకు ఉండనుందని అధికారులు భావిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

గొర్రెలు, మేకల యూనిట్ల కోసం www. nlm. udyamimitra.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. దరఖాస్తుదారుని పాన్‌కార్డు లేదా ఆధార్ కార్డు, అడ్రస్ ప్రూఫ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, రుణం తీసుకునే బ్యాంక్ స్టేట్‌మెంట్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది.

యూనిట్ గొర్రెలు	సబ్సిడీ పొట్టేళ్లు	డబ్బులు (రూ.లక్షల్లో)
500	25	50
400	20	40
300	15	30
200	10	20
100	05	10

అర్హతలు ఇవే..

- గొర్రెలు, మేకల పెంపకంపై ఆసక్తి కలిగిన వ్యక్తి లేదా సంస్థ లేదా స్వయం సహాయక సంఘాలు దరఖాస్తు చేసకోవచ్చు.
- పశుపోషణలో తగిన అనుభవం కలిగి ఉండాలి.
- గొర్రెలు, మేకల పెంపకంపై ఏదైనా గుర్తింపు పొందిన సంస్థ నుంచి శిక్షణ పొంది ఉండాలి.
- సాంకేతిక సలహాదారుగా అనుభవజ్ఞులైన పశువైద్య సిబ్బందిని ఫాం నిర్వహణకు నియమించుకోవాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవాల పెంపకం యూనిట్లను పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలి. అనుభవం ఉన్న నిరుద్యోగులు యూనిట్లు పొంది ఆర్థికంగా బలోపేతం కావాలి. యూనిట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధక కార్యాలయంలో సంప్రందించాలి.

– మనోహర్, జిల్లా పశువైద్యాధికారి

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శంకర్ (ఫైల్)

వెల్గటూర్ (ధర్మపురి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలంలోని ఏడుమోటలపల్లికి చెందిన రాచర్ల శంకర్(43), ఢీకొండ గ్రామానికి చెందిన గోపాల్ గత శనివారం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ఎండపల్లి వైపు వెళ్తున్నారు. ఎండపల్లి మండలంలోని చెర్లపల్లి వద్ద ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోపాల్ కాలు విరగగా, శంకర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శంకర్ సోమవారం మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

మెట్‌పల్లిరూరల్: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వ్యక్తి మృతి చెందినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలంలోని మెట్లచిట్టాపూర్‌కు చెందిన బొమ్మ రవి(46) ఈ నెల 18న మెట్‌పల్లిలో పని ముగించుకొని, బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి, కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమైంది. కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు సోమవారం ఇంటికి తీసుకెళ్లగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: సాంఘిక సంక్షేమ మహిళా గురుకులం, అగ్రికల్చర్ జగిత్యాల, కోరుట్ల కళాశాలలో మహిళా అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు. ఎంటమాలజీ ఎనటిక్స్ ప్లాంట్ బ్రీడింగ్ హార్టికల్చర్, అగ్రానమి, అగ్రికల్చర్ ఎకానమిక్స్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ బోధించేందుకు.. అసోసియేట్ డీన్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ నిబంధనల ప్రకారం పనిచేయాలని, అభ్యర్థుల డెమో కోసం ఈనెల 27న ఉదయం 10 గంటలకు కోరుట్లలోని కళాశాలలో రిపోర్ట్ చేయాలని ఆమె కోరారు.

మానేరు డ్యాంలో దూకిన వివాహిత

- లైఫ్ జాకెట్ విసిరి, రక్షించిన టూరిస్టులు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని మానేరు డ్యాంలో ఓ వివాహిత దూకిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన వివాహిత ఆదివారం డ్యాం వద్దకు వెళ్లింది. టిక్కెట్ కొనుగోలు చేసి, టూరిస్ట్ బోటులో ఎక్కింది. మానేరు అందాలను వీక్షించేందుకు వెళ్తున్న మరో 17 మంది టూరిస్టులు అందులో ఉన్నారు. బోటు స్పీడ్ పెరగగానే సదరు వివాహిత వెనక్కి వెళ్లి, లైఫ్ జాకెట్ పక్కన పడేసి, నీటిలో దూకింది. దీంతో మిగతావారు షాక్‌కు గురయ్యారు. డ్రైవర్ బోటును ఆపగా, టూరిస్టులు కొందరు లైఫ్ జాకెట్ విసిరి, ఆమెను రక్షించారు. అనంతరం లేక్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని, బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎందుకు ఆత్మహత్యాయత్నం చేసిందన్న విషయం తెలియరాలేదు. దీనిపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- 10 నెలల క్రితమే భర్త ఆత్మహత్య
- అనాథలైన ఇద్దరు పిల్లలు
- మానకొండూర్‌లో ఘటన

మానకొండూర్: తల్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది.. తండ్రి 10 నెలల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు.. దీంతో ఐదేళ్లు, నాలుగేళ్ల వయసున్న ఆ దంపతుల పాప, బాబు అనాథలయ్యారు.. ఈ విషాద ఘటన మానకొండూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన కోంద్ర పవన్‌కల్యాణ్, ప్రహర్ష(24) 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఒక పాప, బాబు సంతానం. ఈ క్రమంలో పవన్‌కల్యాణ్ 10 నెలల క్రితం ఇంట్లో ఉరేసుకొని, ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రహర్ష కరీంనగర్‌లోని ఓ ట్రాక్టర్ షోరూంలో పని చేస్తోంది. సోమవారం ఉదయం 9.30 గంటలకు పిల్లలను స్కూల్‌కు పంపించి వస్తానని మామ లక్ష్మణ్‌తో చెప్పి, వెళ్లింది. తిరిగి రాకపోవడంతో అతను చుట్టుపక్కల వెతికాడు. సమీప బావిలో ఆమె శవమై కనిపించింది. అయితే, ఉదయం ఓ వ్యక్తి స్కూటీపై వచ్చి, ప్రహర్షతో మాట్లాడి వెళ్లాడని మృతురాలి అత్త భాగ్య చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రహర్ష చనిపోవడానికి ఆ వ్యక్తే కారణమా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అని మృతురాలి సోదరి నిర్మిట్ల ప్రసన్న అనుమానం వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, పసితనంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను చూసి, వారి నానమ్మ, తాతయ్య కన్నీరుమున్నీరుగా విలపించారు. అది చూసి, స్థానికులు కంటతడి పెట్టారు.


భర్త, పిల్లలతో ప్రహర్ష (ఫైల్)

కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ అరెస్ట్


కోరుట్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కోరుట్ల: గాంధీ ఆసుపత్రిలో చోటుచేసుకుంటున్న మరణాలపై అధ్యయనం చేయడానికి సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి వెళ్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను పోలీసులు అడ్డుకుని నారాయణగూడ స్టేషన్‌కు తరలించారు. దీనిని నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. ప్రభుత్వం ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడడం తగదని పేర్కొన్నారు.

నిరంకుశ పాలనకు నిదర్శనం

కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అరెస్ట్ నిరంకుశ పాలనకు నిదర్శనమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పట్టణంలో సోమవారం మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో దిగజారుతున వైద్య పరిస్థితులను తెలుసుకుని నివేదిక ఇచ్చేందుకు బీఆర్ఎస్ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిందని, సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిని పరిశీలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను పోలీసులు అరెస్టు చేయటం సరికాదన్నారు. అరెస్టులు బీఆర్ఎస్‌కు కొత్త కాదని, ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా.. హౌస్ అరెస్టులు చేసినా భయపడేది లేదని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సీనియర్ నాయకులు చీటి వెంకట్రావు, ఫయాం, బాస్కర్ రెడ్డి, పిడుగు సందయ్య, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల పరిశీలనకు వెళ్తే అరెస్టులా..?: జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలజోన్: గాంధీ ఆస్పత్రి సహా ఇతర ఆస్పత్రులను పరిశీలించేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగించి హౌస్ అరెస్ట్ చేయడం దురదృష్టకరమని జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. జిల్లాకేంద్రంలో సోమవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య వ్యవస్థ దిగజారిందని అన్నారు. మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ రాజయ్య, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌తో ఆసుపత్రుల అధ్యయనానికి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ సభ్యులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవాలు తెలుపాలని సూచించడంతో గాంధీ ఆసుపత్రి సందర్శనకు వెళ్లేందుకు ప్రయత్నించగా హౌస్ అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

అరెస్ట్‌కు వ్యతిరేకంగా నిరసన

మేడిపల్లి: కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ అరెస్టును వ్యతిరేకిస్తు మేడిపల్లి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భీమారం మండలకేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలిపారు. సామాన్యులకు మెరుగైన వైద్యసేవలు అందటంలేదన్నారు. కార్యక్రమంలో వెంకట్రావుపేట మాజీ సర్పంచు అంగడి ఆనంద్, రాజేందర్, లక్ష్మణ్, మారుతి, రఘు, నాంపల్లి నర్సయ్య, స్వామి, రాకేష్, రామానుజం పాల్గొన్నారు.


భీమారంలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

26న ఉద్యోగ మేళా

జగిత్యాల: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 26న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ తెలిపారు. నర్సింగ్ సర్వీసెస్, ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయని, అర్హత, ఆసక్తి గల వారు హాజరు కావాలని సూచించారు.

క్యూలైన్‌లో కుప్పకూలిన భక్తుడు

- వేములవాడ ఆలయంలో ఘటన

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు సోమవారం వరంగల్ నుంచి కుటుంబసభ్యులతో వచ్చిన ఓ భక్తుడికి క్యూలైన్‌లో ఉండగానే ఫిట్స్ వచ్చింది. దీంతో అతను అక్కడే కుప్పకూలాడు. ఆలయ సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడికి ప్రాణాపాయం తప్పిందని పేర్కొన్నారు.


బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఆలయ సిబ్బంది

జాతీయ ట్రెక్కింగ్ పోటీలకు ఎంపిక


అనిల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు

కరీంనగర్ సిటీ: కరీంనగర్ ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎం.అనిల్ అక్టోబర్ 22న హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరిగిన ట్రెక్కింగ్ క్యాంప్ సెలక్షన్స్‌లో అతను ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా సోమవారం అనిల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్, బీకాం డిపార్ట్‌మెంట్ హెడ్ టి.రాజయ్య, వైస్ ప్రిన్సిపాల్ పి.నితిన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అర్జున్, రాజేశం, ఎలిజబెత్ రాణి, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

నిప్పంటించుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలింపు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్ అనే యువకుడు నిప్పంటించుకొని, ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడి బంధువుల వివరాల ప్రకారం.. శివప్రసాద్, అతని భార్య మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో అతను మనస్తాపానికి గురై, సోమవారం ఉదయం ఒంటిపై పెట్రోల్ పోసుకొని, నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలైన అతన్ని కుటుంబసభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

గడ్డి మందు కొట్టిన గడ్డి తిని..

- 60 జీవాలకు అస్వస్థత
- రెండు మేకలు మృతి


జీవాలకు వైద్యం అందిస్తున్న డాక్టర్ రవీందర్

గొల్లపల్లి(ధర్మపురి): గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన సందవేని చిన్న వెంకన్న అనే రైతుకు చెందిన 40 జీవాలు అస్వస్థతకు గురైనట్లు వైద్యాధికారి రవీందర్ తెలిపారు. గడ్డి మందు కొట్టిన గడ్డిని మేయడం వల్లే ఇలా జరిగిందన్నారు. అలాగే, తిర్మలాపూర్ పీడీ గ్రామానికి చెందిన బిరుదుల గంగాధర్ అనే రైతుకు చెందిన మేకలు గడ్డి మందు కొట్టిన గడ్డి మేశాయని తెలిపారు. 2 మేకలు చనిపోగా 20 జీవాలు అస్వస్థతకు గురయ్యాయన్నారు. సోమవారం వీటన్నింటికీ వైద్యం అందించినట్లు పేర్కొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి


నర్సింగరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలోని పద్మశాలీ సంక్షేమ సంఘ భవనాన్ని సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జువ్వాడి నర్సింగరావు సందర్శించారు. అక్కడే ఉన్న మార్కండేయ కోటి నవదుర్గ ఆలయానికి వచ్చే భక్తులు సీసీ రోడ్డు, డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటి ఏర్పాటుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, కౌన్సిలర్ నాగభూషణం, జిల్లా ధనుంజయ్, ఆడెపు మధు, ముల్క ప్రసాద్, గుంటుక ప్రసాద్ తదితరులున్నారు.

అటవీభూముల పరిశీలన


అటవీ భూములను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్‌వో, ఎస్సై

కథలాపూర్: మండలంలోని ఇప్పపల్లి శివారులోని అటవీ భూములను ఎఫ్ఆర్‌వో పద్మారావు, ఎస్సై నవీన్‌కుమార్ పరిశీలించారు. చెట్లను తొలగించి చదును చేశారన్న ఫిర్యాదుల మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించారు. రెండురోజుల క్రితం భూముల పరిశీలనకు వెళ్లగా కొందరు అడ్డుకోవడంతో సోమవారం పోలీస్ బందోబస్తుతో అక్కడికి చేరుకున్నారు. చెట్లను తొలగించి భూములు చదును చేసినట్లు గుర్తించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎఫ్ఆర్‌వో సురేశ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ మల్లేశం, బీట్ ఆఫీసర్లు శ్రావణ్, రఫీనయీం పాల్గొన్నారు. అటవీశాఖ భూములను అక్రమంగా చదును చేసినట్లు బీట్ ఆఫీసర్ శ్రావణ్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

దాడి చేసి.. డబ్బులు, ఫోన్ లాక్కెళ్లి

- పోలీసులకు చిక్కిన ముగ్గురు నిందితులు
- 200 గ్రాముల గంజాయి, బైక్, 4 ఫోన్లు, రూ.5 వేలు స్వాధీనం


నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఓ వ్యాన్ డ్రైవర్‌పై దాడి చేసి, డబ్బులు, ఫోన్ లాక్కెళ్లిన ముగ్గురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. వారిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా ఉప్లూర్‌కు చెందిన సుదగోని గంగాధర్‌గౌడ్ అనే డ్రైవర్ ఈ నెల 21న రాత్రి మక్కల లోడును ఆర్మూర్ వైపు నుంచి మెట్‌పల్లి వైపు తీసుకెళ్తున్నాడు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండలింగాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి మూత్ర విసర్జన చేస్తున్నాడు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అక్కడికి వచ్చారు. అతన్ని అగ్గిపెట్టె ఉందా అని అడిగి, దాడి చేశారు. రూ.5 వేలు, సెల్‌ఫోన్ లాక్కొని, ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించి, పరారయ్యారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి, నిందితుల కోసం గాలించగా సోమవారం మేడిపల్లి క్రాసింగ్ వద్ద బైక్‌పై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. సీఐ నిరంజన్‌రెడ్డి వారిని పట్టుకున్నారు. విచారణలో మెట్‌పల్లి మండలంలోని మేడిపల్లికి చెందిన ఏనుగు వంశీ, మెట్‌పల్లి మఠంవాడకు చెందని బైండ్ల వేణు, బండలింగాపూర్‌కు చెందిన కైర వెంకటేశ్ అలియాస్ రవిగౌడ్‌లని తేలిందన్నారు. వ్యాన్ డ్రైవర్‌పై దాడి చేసి, ఫోన్‌తోపాటు రూ.5 వేలు ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి బైక్‌లో 200 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయితోపాటు 4 ఫోన్లు, రూ.5 వేలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. 48 గంటల్లోనే నిందితులను పట్టుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై అనిల్‌కుమార్, కానిస్టేబుళ్లు గంగారాం, చైతన్యలను డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మక్కయ్య మృతదేహం

కోరుట్ల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని ఏస్కోనిగుట్టకు చెందిన పెంట మక్కయ్య (47) సోమవారం ఉదయం బైక్‌పై కోరుట్ల వైపు వస్తున్నాడు. పట్టణ శివారులోని గార్డెన్స్ వద్ద ఆగివున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు ఢీకొని ఒకరి దుర్మరణం


ఆంజనేయులు (ఫైల్)

కరీంనగర్‌రూరల్: కారు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధి ప్రియదర్శిని కాలనీకి చెందిన జేరిపోతుల ఆంజనేయులు(45) సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అతనికి భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఆంజనేయులు ఆదివారం రాత్రి 7 గంటలకు పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. దుర్శేడ్ శివారులో అతివేగంగా వస్తున్న కారు వెనక నుంచి అతన్ని బలంగా ఢీ కొట్టింది. అదే సమయంలో కరీంనగర్ నుంచి నల్ల గుంటపల్లెకు బైక్‌పై వెళ్తున్న దుబ్బాసి వినోద్, వద్లూరి కిరణ్ ఈ ప్రమాదాన్ని గుర్తించి, ఆంజనేయులు భార్యకు ఫోన్ చేసి, చెప్పారు. అనంతరం బైక్‌పై కారును వెంబడించినా ఫలితం లేకపోయింది. క్షతగాత్రుడిని స్థానికులు 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతివేగంగా కారు నడిపి, తన భర్త మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మృతుడి నేత్రాల సేకరణ..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆంజనేయులు కోరిక మేరకు అతడి నేత్రాలను సోమవారం కుటుంబసభ్యుల సమక్షంలో ఎల్‌వీ ప్రసాద్ వైద్యశాల సిబ్బంది సేకరించారు. కుటుంబసభ్యులు జేరిపోతుల యశ్వంత్, సాయిచరణ్, సుమన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కోల అన్నారెడ్డి, చింతల కిషన్, గాజుల సతీశ్‌కుమార్ తదితరులున్నారు.

రైతు మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు

- పంటల రక్షణకు విద్యుత్ సరఫరా చేయొద్దు
- మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి


మాట్లాడుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): పంట రక్షణకు ఏర్పాటు చేసిన కంచెకు విద్యుత్ సరఫరా చేసి, ఓ రైతు మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. సోమవారం మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్‌కు చెందిన గొండ సాయన్న తన వ్యవసాయ భూమిలో మొక్కజొన్న సాగు చేశాడు. ఆ పంటను అటవీ జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు చుట్టూ ఇనుప కంచె అమర్చి, అనుమతి లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాడు. ఈ మొక్కజొన్న పంట పక్కనే జెల్ల పెద్ద ముత్తన్న(60) వరి సాగు చేస్తున్నాడు. ఈ నెల 18న పంటకు ఎరువు చల్లుతూ ప్రమాదవశాత్తు ఇనుప కంచెకు తగిలాడు. దీంతో విద్యుదాఘాతం సంభవించి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఇనుప కంచెకు కరెంట్ వస్తుందన్న సమాచారం ఇవ్వకుండా సాయన్న తన భర్త మృతికి కారణమయ్యాడని మృతుడి భార్య పెద్దిరాజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కిరణ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ వినీత్‌రెడ్డిలతో కలిసి సీఐ నిరంజన్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి, విచారణ చేపట్టారు. అప్పటికే నిందితుడు సాయన్న పరారయ్యాడు. సోమవారం కుస్తాపూర్‌కు వచ్చాడన్న సమాచారంతో పోలీసులు వెళ్లి, అతన్ని అరెస్టు చేశారు. రైతులు పంటల రక్షణ కోసమని అనుమతి లేకుండా విద్యుత్ సరఫరా చేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ కలీం, కానిస్టేబుళ్లు భూమయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో గొడవపడి.. పెట్రోల్ తాగి

- తండ్రికి ఫోన్ చేసిన కుమారుడు
- తర్వాత అపస్మారక స్థితిలోకి..
- సెల్‌ఫోన్ లొకేషన్ ద్వారా గుర్తించి, ఆస్పత్రికి తరలింపు


చికిత్స పొందుతున్న నరేశ్

ముస్తాబాద్(సిరిసిల్ల): తల్లిదండ్రులతో గొడవపడ్డాడు.. క్షణికావేశంలో పెట్రోల్ తాగాడు ఓ యువకుడు.. కడుపులో మంట భరించలేక తండ్రికి ఫోన్ చేయడంతో కానిస్టేబుల్ సహాయంతో ఆస్పత్రికి తరలించాడు. వివరాల్లోకి వెళ్తే.. ముస్తాబాద్ మండలంలోని మద్దికుంటకు చెందిన పల్లపు నరేశ్ సోమవారం ఇంట్లో అమ్మానాన్నతో గొడవ పడ్డాడు. అలిగి, బయటకు వెళ్లిపోయాడు. ముస్తాబాద్, నామాపూర్ గ్రామాల మధ్య చెట్ల పొదల్లో పెట్రోల్ తాగాడు. కడుపులో మంట భరించలేక తండ్రి నర్సింలుకు ఫోన్ చేశాడు. తనను కాపాడాలంటూ అపస్మాకర స్థితిలోకి వెళ్లాడు. నర్సింలు చుట్టుపక్కల గాలించినా నరేశ్ ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, విషయం చెప్పాడు. ఎస్సై గణేశ్ ఆదేశాలతో ఐటీ కానిస్టేబుల్ రాజశేఖర్ వెంటనే నరేశ్ సెల్‌ఫోన్ లోకేషన్ తెలుసుకున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో చెట్ల మధ్య ఉన్న నరేశ్‌ను గుర్తించి, హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు తెలిపారు. యువత తల్లిదండ్రులతో గొడవ పడి, క్షణికావేశంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఎస్సై సూచించారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి


పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రామగుండం వాసులు

పెద్దపల్లిరూరల్: రామగుండంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను తమకు కేటాయించాలని ఎంపికైన లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి, నిరసన తెలిపారు. మొత్తం 660 ఇళ్ల కోసం ఇప్పటికే ఎంపిక చేసినవారికి వీలైనంత త్వరగా ఇళ్లను కేటాయించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసేలా చొరవ చూపాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు విన్నవించారు. గతంలోనూ పలుమార్లు మొరపెట్టుకున్నామని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన ఎంపికైనవారికి నెల రోజుల్లోగా ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు ఐదారు మాసాల సమయం పట్టే అవకాశముందని పేర్కొన్నారు.